జై శ్రీమన్నారాయణ!

పరమహంస పరివ్రాజకులు

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్‌స్వామి వారి**

మంగళాశాసనములతో...

**శ్రీ రంగ గద్యము గ్రంథ ముద్రాపకులు**



విజయవాడ వాస్తవ్యులు

**శ్రీమాన్ బండ్రెడ్డి శేషగిరి రావు,**

**శ్రీమతి సత్యవతి దంపతులు,**


మరియు వీరి చిరంజీవులు

**చి॥ పూర్ణిమ, చి॥ తేజస్వి, చి॥ శరత్ చంద్రలు**

**భక్తితో సమర్పణము**

జై శ్రీమన్నారాయణ!

# శ్రీరంగ గద్యము





స్వేచ్ఛానువాదము


**కరి తిరువేంగళమ్మ**



**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్**

జై శ్రీమన్నారాయణ!

# శ్రీరంగ గద్యము



స్వేచ్ఛానువాదం :

**కరి తిరువేంగళమ్మ**

ప్రకాశకులు :

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్**

సీతానగరం

శ్రీరంగ గద్యము

ముద్రణ : 2013 డిసెంబరు

ప్రతులు : 500

ప్రతులకు :

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్,**
**సీతానగరం-522 501,**
**గుంటూరు జిల్లా, ఆం.ప్ర.**
ఫోన్ : 08645 272353

**జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్,**
గగన్‌మహల్‌కాలనీ,
దోమల్‌గూడ, హైదరాబాద్.
ఫోన్ : 040 40240437
23224426

**శ్రీరామానుజవాణి**
11-49-136,
శివాలయం వీధి,
విజయవాడ - 1
ఫోన్: 0866 2420 820

**శ్రీమతి కరి తిరువేంగళమ్మగారు**
MIG - 81
అలకనందా కాలనీ
విజయనగరం - 531203
సెల్: 9441873801

**DTP : పరిశోధనాలయం,**
**ముద్రణ : శ్రీమాన్ ప్రింటర్స్ & ప్రోసెసర్స్, సీతానగరం.**

# విన్నపము

**శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయరు స్వామివారి** మంగళాశాసన బలంతో నేను కూడా కొన్ని గ్రంథాలను రచించాను. ఇదొక క్రొత్త ప్రయత్నం.

భగవద్రామానుజ విరిచితమైన గద్యత్రయంలో చిన్నది, రసవత్తరమైనది, శ్రీ వైష్ణవశిరోధార్యమైనది **శ్రీరంగగద్య.** దీనిని ద్రావిడ వ్యాఖ్యానాలను అనుసరించి, తెనుగులో వ్రాసే ప్రయత్నం చేసాను.

శ్రీ స్వామివారి అనుగ్రహం నామీదకు ఎప్పుడూ ప్రసరిస్తూనే ఉన్నది. అదే ధైర్యంతో ఈ చిన్ని పొత్తాన్ని సహృదయ కరాంజలులకు అర్పిస్తున్నాను. రామానుజవాణి నిర్వాహకులు మా నాన్నగారిపైనున్న ఆదరాన్ని నాపైన కూడా ప్రసరింపచేసి, దీని ప్రచురణ బాధ్యతను స్వీకరించారు. శ్రీమాన్ పురాణం వేంకటాచార్యస్వామివారి సన్నిధిన నా కృతజ్ఞతాంజలులు సమర్పిస్తున్నాను.

విజయవాడ వాస్తవ్యులైన **బండ్రెడ్డి శేషగిరిరావు, బండ్రెడ్డి సత్యవతి** దంపతులు తమ పవిత్ర ద్రవ్యాన్ని ఈ గ్రంధముద్రణకు సమర్పించారు. వారు, వారి చిరంజీవులు **చి॥ పూర్ణిమ, చి॥ తేజస్వి, శరత్‌చంద్రలు** శ్రీరంగనాథుని అనుగ్రహంతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో విరాజిల్లాలని, భగవద్భాగవత సేవా భాగ్యాన్ని పొందాలని శ్రీకృష్ణపదసన్నిధిన ప్రార్థన చేస్తున్నాను.

**భాగవత దాసి**
**క. తిరువెంగళమ్మ**



భగవద్రామానుజులు

జై శ్రీమన్నారాయణ!

# శ్రీరంగ గద్యము

**రంగడే దైవము! పొంగలే ప్రసాదము!!**

అనే నానుడి మనం వింటూ ఉంటాం కదా! ఏమిటా పోలిక! ఒక్కసారి ఆలోచిద్దాం. స్నేహమిశ్రితమై (నేతితో కలసి) చూడగానే నోట్లో వేసుకోవాలని పించే ప్రసాదం పొంగలి.

పులిమోర, దధ్యోజనం ఎన్ని ఉండనీండి పొంగలి ప్రత్యేకతే వేరు. అంతేకాదు, కాస్త మిరియాలు, అల్లం మొదలయిన ఆరోగ్యాన్నందించే పదార్థాల మేళవింపు పొంగలి. అదిగో అవే లక్షణాలు మన రంగనాథునిలో కనిపిస్తాయి.

కస్తూరీ కలితోర్ధ్వ పుండ్ర తిలకం, కర్ణాన్తలోలేక్షణం
ముగ్ధ స్మేర మనోహరాధరదళం ముక్తా కిరీటోజ్జ్వలమ్ ।
పశ్యన్మానస పస్యతో హరరుచం పర్యాయ పంకేరుహం
శ్రీరంగాధిపతేః కదాను వదనం సేవేయ భూయోఽప్యహమ్ ॥

'కస్తూరీ తిలకాలంకృతమై, చెంపకు చేరదేసి కన్నులతో చిరునవ్వులు చిందులాడే అధరశోభతో ముక్తా కిరీటోజ్వలమై, చూచిన వారందరి మనసులను కొల్లగొట్టే ఆ శ్రీరంగనాథుని ముఖారవిందాన్ని మాటిమాటికి ఎప్పుడు సేవిస్తానో కదా అంటారు" పరాశర భట్టరు.

ఈ విధంగా దృష్టిచిత్తాపహారి అయి, అర్చామూర్తిగా మనకందుబాటులో ఉండేవాడు పరమపదనాథుడు. ఈ స్వామికంటే పరదైవం మనకెక్కడ దొరుకుతాడు కనుక!

భగవద్రామానుజులు శాస్త్రీయంగా, ప్రతివాది భంజకంగా ఉండడానికి శ్రీభాష్యంలో భక్తియే మోక్షోపాయమని నిర్ధారించారు. కాని, హృదయం ఆర్ద్రమై, భగవంతుడంటే దుష్టశిక్షణ, శిష్టరక్షణ కూడా చేసేవాడని కాక, శిష్టరక్షకుడని

మాత్రమే విశ్వసించి తమ భారాన్ని భగవంతునిపైనుంచి నిర్భరులై ఉండే జ్ఞానుల కొరకై శరణాగతి అనే చిట్టచివరి సాధనాన్ని అందించ నిశ్చయించారు. దీనినే సిద్ధభక్తి అంటారు. అంటే నీవు ఆర్జించిన జ్ఞానంచేతో, నీవు అభ్యసించిన భక్తివలనో నీవు ఆచరించిన కర్మకారణంగానో కాక కేవలం భగవదనుగ్రహం వలననే ఉత్తమ ఫలితమైన భగవత్సేవాభాగ్యం లభిస్తుందనే ఆ విషయాన్ని 'శరణాగతి గద్య, శ్రీరంగగద్య, వైకుంఠగద్య' అనే మూడు గద్యలలోను లోకానికి అందించారు.

శరణాగతి చేయాలి అని శరణాగతి గద్యలో చెప్పి, ఆ శరణాగతి సర్వసులభుడై, సమస్త ఫలప్రదాత అయిన అర్చామూర్తి సన్నిధిని చేయడమే యుక్తమని శ్రీరంగగద్యలో తెలియచేస్తున్నారు. మనందరికి ప్రతినిధిగా మార్గనిర్దేశకులుగా, తమ ఆర్తిని కలబోసి భగవద్రామానుజులు అందించిన శ్రీరంగగద్యను కాస్తయినా అనుభవించే ప్రయత్నం చేద్దాం!

ఈ గద్యలో కనిపించే భావాలేమిటో తెలుసుకుందామా! ముందు మనం పొందవలసినదేమిటో తెలియాలి. ఏమది? భగవత్ కైంకర్యం. ఇది పొందాలంటే ముందుగా మనలో ఉన్న దోషాలను భగవంతునివద్ద విన్నవించుకొని, ఏం చేయనయ్యా, కాసేపు మనసు నిలవదు, బుద్ధిమాట వినదు, ఇంద్రియాలో వాటి దారి అవి చూసుకుంటున్నాయి.

నేనేమో చేతకాని అశక్తుడనయ్యా అని నిర్మొహమాటంగా స్వామి సన్నిధిని విన్నవించి "స్వామీ! నీపాదపద్మాలే శరణు!" అని భగవత్పాదారవిందాలే భగవంతుని పొందించడానికి ఉపాయమని, ఆ ఉపాయాన్నే స్వీకరించి, ఆ శ్రీరంగనాథుడుని అర్థిస్తే చాలు ఉత్తమఫలితాన్ని అందిస్తాడన్న విశ్వాసం కలిగి ఉండాలి.

నిజమే! కాని ఇది మాత్రం మన ఇష్టమా! అందుకని 'స్వామీ, నా తండ్రీ! సమస్త కళ్యాణగుణాకరుడవైన నీవే నాకీ విశ్వాసాన్ని కలిగించాలి' అని ప్రార్థన చేశారు భగవద్రామానుజులు.





అంతేకాదు, 'స్వామీ నీకే చెందిన ఈ ఆత్మ వస్తువును, దానికి తగిన రీతిలో ప్రవర్తించేలా నువ్వే అనుగ్రహించు' అని అర్థించారు. భగవానుడు అలా దిద్దుబాటు చేయకపోతే మనవంటి స్థితిలో ఉన్నవారికి పొందవలసినది భగవత్కైంకర్యమనే బుద్ధే కలుగదు కదా! ఈ శరణాగతి నిష్ఠులు ఎలా ఉంటారో పరిశీలిద్దాం!

**మొదటిరకం వారు :** భగవానుడు అభిమానించి తాను అర్చామూర్తియై వెలసి ఉండే శ్రీరంగం, కంచి మొదలైన దివ్యదేశాల్లో ఉంటూ, ఆ దైవానికి నమస్కరించి, పూజించి, సేవచేసి కాలాన్ని గడుపుతూ ఉంటారు.

**రెండవ రకంవారు:**

"ఆరాధనానాం సర్వేషాం విష్ణోరారాధనం పరమ్ ।
తస్మాత్ పరతరం ప్రోక్తం తదీయారాధనం పరమ్ ॥

దేవతారాధనలన్నింటిలోనూ విష్ణువునారాధించడం శ్రేష్ఠమయినది. అంతకంటే గొప్పది విష్ణుభక్తులనారాధించడం అన్న సత్యాన్ని నమ్మి భగవద్భక్త కైంకర్యం చేస్తూ ఉంటారు.

**మూడవ రకంవారు:** భగవంతుని గుణాలను మాటిమాటికి స్మరిస్తూ, ఆ అనుభూతితో పరవశించిపోతూ కాలాన్ని గడుపుతూ ఉంటారు.

**నాల్గవ రకంవారు:** ద్వయంయొక్క అర్థాన్ని అనుసంధానం చేస్తూ కాలం గడుపుతూ ఉంటారు. ఇందులో చివరి పద్ధతిలో అనుసంధానం చేస్తూ కాలం గడపాలని భావించిన భగవద్రామానులు ద్వయార్థాన్ని విస్తారంగా శరణాగతి గద్యలో చెప్పి, ఈ శ్రీరంగగద్యలో కాస్త సంగ్రహంగా తెలుసుకునే వారికి సదుపాయంగా, భగవానునికి వినడానికి విసులు లేకుండా ఉండేలా అనుగ్రహిస్తున్నారు.

**మూలము:**

**స్వాధీన త్రివిధ చేతనాచేతన స్వరూప స్థితి ప్రవృత్తి భేదం, క్లేశకర్మా ద్యశేష దోషాసంస్పృష్టం, స్వాభావికానవధికాతిశయ జ్ఞాన బలైశ్వర్య వీర్య శక్తితేజ స్సౌశీల్య**

**వాత్సల్య మార్దవార్జవ సౌహార్ద సామ్య కారుణ్య మాధుర్య గాంభీ ర్యౌదార్య చాతుర్య స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమ సత్యకామ సత్యసంకల్ప కృతిత్వ కృతజ్ఞతా ద్యసంఖ్యేయ** కల్యాణగుణగణౌఘ మహార్ణవం, పరబ్రహ్మభూతం, **పురుషోత్తమం శ్రీరంగశాయినమ్, అస్మత్స్వామినం ప్రబుద్ధ నిత్యనియామ్య నిత్యదాస్యైకరసాత్మ** స్వభావోఽహం తదేకానుభవ, **స్త దేక ప్రియః పరిపూర్ణం భగవంతం** విశదతమానుభవేన నిరంతర **మనుభూయ తదనుభవజని తానవధికాతిశయ ప్రీతికారితా శేషావస్థోచితా శేషశేషతైకరతిరూప నిత్యకింకరో భవాని ॥**

ముందుగా తమ కోరిక ఏమిటో చెబుతున్నారు. భగవానుడైన రంగనాథునివద్ద తాము నిత్యకైంకర్యము చేయాలి అని కోరుకుంటున్నారు. ఆ భగవానుడెటువంటి వాడో ముందుగా తెలియచేస్తున్నారు.

'భగవానుడు చేతన, అచేతనములకన్న వేరయినవాడు. వాటిని నియమించేవాడు' అని అంటున్నారు. చేతనులు అంటే జీవులు. వీరు మూడు రకాలుగా ఉంటారు. మనవలె జన్మపరంపరా వలయంలో పరిభ్రమించేవారిని బద్ధులు అంటారు. కొంతవరకు ఈ లోకంలో ఉండి, భగవందనుగ్రహం వలన మోక్షాన్ని పొందిన వారిని ముక్తులు అంటారు. ఆళ్వారాదులు అటువంటి వారు. ఇంక ఈ జన్మ మరణాదు లనే ఎరుగక, ఎల్లప్పుడూ పరమపదంలో ఉండేవారిని నిత్యులు అంటారు. అనంతుడు, గరుడుడు, విష్వక్సేనుడు మొదలైనవారు. బద్ధుల స్థితి దుర్భరం. వీరికి జ్ఞానసంకోచం కలిగి ఉంటుంది. ప్రకృతి సంబంధం వలన సహజంగా జ్ఞానానంద స్వరూపమైన వారే అయినా ఈ బద్ధజీవులయొక్క జ్ఞానానికి హద్దులు ఏర్పడతాయి. కంటితో కొంతదూరమే చూడగలగడం, చెవితో కొంత పరిధిలో ఉన్న శబ్దాన్నే వినగలిగి ఉండటము. ఇదే బద్ధజీవుల స్వరూపం.

ఇంక నిత్యులు అసలు సంసార సంబంధమే ఎరుగనివారు. ముక్తులవలె క్రొత్తగా వచ్చినవారు కారు. అనాదిగా అనంతమైన కైంకర్యమనే సామ్రాజ్యాన్ని అందుకున్నవారు. అదే వారి స్థితి. సదా భగవద్దర్శనం చేయడం, నిత్య





స్తుతిశీలురై ఉండడం వీరి ప్రవృత్తి. అందుకే వీరిని నిత్యులు అంటారు. ఇవి జీవులలోని భేదాలు. వారి లక్షణాలు తెలుసుకున్నాం.

ఇంక ప్రకృతినికూడా మూడురకాలుగా విభజించవచ్చు. మొదటిది శుద్ధ సత్త్వమైన అచిత్తు. అది పరమపదంలో ఉండే ప్రాకార, మండప, వృక్షాది రూపేణ బయటకు ద్యోతకమవుతుంది. ఇది పంచోపనిషత్ మయమై ఉంటుంది. మన శరీరం పంచభూతాలతో తయారయినట్లే పంచోపనిషత్తులని వ్యవహరింప బడే ద్రవ్యాలతో తయారవుతుంది.

ఉపనిషత్తులంటే మనకు తెలిసిన గ్రంథాలు కావిక్కడ. ఈ అచిత్తు తమోగుణం, రజోగుణం అనే వాటితో కలవని శుద్ధ, సత్త్వ గుణం కలిగి ఉంటుంది. ఎల్లప్పుడూ ఒకేవిధంగా ఉంటుంది. నిత్యులు, ముక్తులు కైంకర్యం చేయడానికి తాను సాధనమయి ఉంటుంది. భగవానుని రక్షణకు అనుకూలంగా దిగి వచ్చినా ఆ స్వామి ధరించే దివ్యదేహముగా, పరిణమించేది కూడా ఈ శుద్ధ సత్త్వరూపమైన అచిత్తే! ఇది దాని స్థితి. ఎల్లప్పుడూ ప్రకాశమే దీని లక్షణం.

ఇంక రెండవది ప్రకృతి. ఇది సత్త్వ రజ స్తమోగుణములు మూడు కలసిన ఒక కలయిక. ఇది ఎల్లప్పుడూ మారుతూనే ఉంటుంది. ఇదే దాని స్వరూపం. ఈ చేతనులయొక్క కర్మానుగుణంగా మారుతూ ఉండడమే దాని స్థితి. చేతనులకు తమ స్వరూపాన్ని, భగవత్స్వరూపాన్ని కూడా కనబడనీయకుండా చేస్తుంది. ఇది దీని ప్రవృత్తి.

ఇంక మూడవది కాలము. ఇది ప్రకృతి కంటే వేరయినది. ఎప్పుడూ ఏకరూపంగా ఉండడం దీని స్వరూపం. నిమిషాలుగా అందులో ఇంకా కాష్ఠలు మొదలైన చిన్న చిన్న భాగాలుగా ఇది విభజింపబడి ఉంటుంది. ఇదే దీని స్వరూపం. ప్రాకృత పదార్థములు వానితో తయారుచేయబడిన చేతనులు. వాటిని నియమించేది కాలమే. వాటి ఉత్పత్తి, వినాశము, కాలాన్ని బట్టే జరుగు తుంది. కనుక అదే దాని ప్రవృత్తి. ఈ విధంగా ఉన్న మూడురకాల జీవులను మూడురకాలుగా ఉన్న ప్రకృతి తన స్వాధీనములో ఉంచుకున్నవాడు పరమాత్మ.

అంటే వీటన్నిటికీ తాను ఉంతరాత్మగా ఉండి నియమిస్తాడు అని అర్థం.

సకల చేతనాచేతనముల సత్త, స్థితి, ప్రవృత్తి భగవదధీనము అని చెప్పేరు. కనుక, అవన్నీ శరీరములవంటివి. భగవానుడు ఆత్మ అని తెలుస్తుంది. శరీరముయొక్క సత్త, స్థితి, ప్రవృత్తి ఆత్మాధీనమయి ఉంటాయి. దీనివలన భగవానుని సంపద తెలుస్తున్నది. చేతనాచేతనములన్నీ ఆ సర్వేశ్వరుని సంపదే కదా!

వెనుక చేతనాచేతనములు స్వామికి శరీరములు అని చెప్పేరు కదా... మరేమున్నది. ఆ శరీరానికున్న దోషాలు ఆత్మకు అంటవా? అని మనకు సందేహం కలిగే అవకాశమున్నది. ఆధేయము, విధేయము, శేషము అయి ఉన్నది శరీరం అనేది ఉపనిషత్ సిద్ధాంతం.

చేతనాచేతనములన్నీ భగవానునిపై ఆధారపడి, వానికి లొంగి ఉండి వానికే చెంది ఉంటాయి. కనుక, ఇవి స్వామికి శరీరములే! మన శరీరంలో ఉన్న మనం అంటే జీవాత్మ కూడా జ్ఞానానందాది లక్షణములు కలది. అయినా శరీర సంబంధం వలన దానికుండే జ్ఞానం సంకోచిస్తుంది. అలాగే ఈ చేతనాచేతనములు భగవానునికి శరీరమయినప్పుడు వాటికుండే దోషములు స్వామికి కూడా అంటూతాయేమో అని తోస్తుంది. కాదంటున్నారు ఎంబెరుమానార్. జీవునికుండే దుఃఖాలు ముఖ్యంగా అయిదు రకాలు.

1. **క్లేశములు: అవిద్య, అస్మిత, అభినివేశ, రాగద్వేషాదులు.**

**అవిద్య:** అజ్ఞానం, ఇది మళ్ళీ మూడురకాలు.

**1. అజ్ఞానం:** అసలే తెలియకపోవడం. దేహముకంటే వేరయిన ఆత్మత్త్వం ఉన్నదని ఎరుగక పోవడం.

**2. అన్యథాజ్ఞానం:** ఒకలా ఉన్న పదార్థం వేరొకలా కనుపించడం. ఈ జీవాత్మ భగవానునికే చెందినది. కాని అది వేరొకరికి చెందినది అని భాసించడం.





**3. విపరీత జ్ఞానం:** పరునకు చెందిన (పరతంత్రమైన) తనను స్వతంత్రునిగా భావించడం. ఇవి మూడు అవిద్య వలన కలుగుతాయి.

**అస్మిత:** దేహాత్మ భ్రాంతి. ఈ శరీరమే నేను అనుకోవడం.

**అభినివేశం:** దేనినైనా కోరుకొని అది లేకపోతే ఉండలేని కోరికని పెంచుకోవడం.

**రాగము:** దేనియందైనా విపరీతమైన ప్రేమ.

**ద్వేషము:** ఎవరియందైనా విపరీతమైన ద్వేషము.

**2. కర్మ :** ఈ క్లేశములకు కారణమేమిటి? మనము చేసిన కర్మ. ఇది పుణ్యాపాప రూపమయినది.

ఇవి కాక వీటికి సంబంధించి మరి రెండు విషయాలున్నాయి. మొదటిది

**విపాకం :** ఈ కర్మవలన వచ్చే దేవ, మనుష్య, తిర్యక్, స్థావర రూపాలు. ఎన్నాళ్ళు ఆ శరీరంతో ఉంటారో తెలియచేసే ఆయుష్షు.

**ఆశయం:** ఆయా జాతులకు తగిన బుద్ధి విశేషం. ఈ దోషాలేవీ సర్వేశ్వరునిలో లేవు. మూలంలో 'అశేష' అనే పదం వాడేరు కనుక జీవునిలో ఉండే దోషాలు కాక ప్రకృతిలో ఉండే దోషం సంతత పరిణామశీలత, అది కూడా తనకంటనివాడు పరమాత్మ. జీవునికున్న దోషాలూ, ప్రకృతికున్న దోషాలు కూడా ఏనాడు పరమాత్మని స్పృశించలేవు. చెడుగుణాలు లేకపోవడం మాత్రమేనా, అన్ని మంచిగుణాలు రాశీభూతమై ఉన్నవాడు పరమాత్మ.

సర్వేశ్వరునియొక్క గుణాలను చెప్పడానికి సిద్ధపడుతూ అవి ఎటువంటివో తెలియచేస్తున్నారు. ఆ గుణాలలో కొన్ని అందరికీ ఉపయోగపడేవి. కొన్ని ఆశ్రితుల విషయంలో ప్రవర్తించేవి. కొన్ని ఆ'శిత విరోధుల విషయంలో ఉపయోగపడేవి. ఇవన్నీ స్వాభావికమయినవి. అంటే సహజంగా ఉన్నవి. నీటికి చల్లదనంలాగ సహజంగా ఉండేవి ఈ గుణాలు. అంటే భగవానుడున్నాడు

అంటే ఈ గుణాలు ఉండి తీరుతాయి అన్నమాట. ఈ గుణములు అంతులేనివి. అంతకంటే మించినవి. మరి ఎక్కడా కానరానివిధంగా ఉండేవి. **ఏకైక గుణావధీప్సయా సదా స్థితా** అంటారు యామునాచార్యులవారు తమ స్తోత్రరత్నంలో. ఒక్కొక్కటే అంతులేనివి. ఆశ్చర్యం కలిగించేవి ఈ గుణాలు. ఇంక ఆ గుణాలను వివరిస్తున్నారు.

**జ్ఞానం:** "యో వేత్తి యుగపత్సర్వం ప్రత్యక్షేణ సదా స్వతః" అన్నట్లుగా సర్వకాలములందు, సర్వపదార్థముల గురించి ఒకేసారి తెలుసుకోగలగడమే జ్ఞానం. అనేక రకాలుగా ఉండే ఈ సృష్టిలో ఉన్న అసంఖ్యామైన ఆత్మలయొక్క స్వరూప భేదము, నామభేదము ఎరిగి ఉండే శక్తే జ్ఞానం.

**బలం:** సృష్టించబడిన సకల పదార్థాలను తనసంకల్పలేశము చేత నిలబెట్టగల సామర్థ్యం.

**ఐశ్వర్యము:** తనచే నిలబెట్టబడిన అన్ని ఆత్మలకు వారి వారి కర్మల ననుసరించి నడిపించే నియమన సామర్థ్యం.

**వీర్య:** సృష్టిమొదలైన సకల వ్యాపారములు చేసేటప్పుడు అనాయాసంగా చేయడం. ఏమీ మార్పు లేకుండా ఉండడం.

**"యథా సన్నిధి మాత్రాయ గన్ధః క్షోభాయ జాయతే**
**మనసో నోప కర్తృత్వాత్తథాసీ పరమేశ్వరః"**

'సువాసన' తాను ఏమీ మారకుండానే, ఆ వాసన పీల్చిన వారిని ఆహా, ఓహో అనేలా చేస్తుంది. అదేవిధంగా తాను చలించకుండానే యుద్ధంలో శత్రువీరులను కకావికలము చేసేది వీర్యం.

**శక్తి:** సృష్టింపబడిన జీవులు వారి వారికి తగిన ప్రవృత్తులలో అన్వయించడానికి తగిన శక్తిని వారికందించే సామర్థ్యం లేదా అఘటిత ఘటనా సామర్థ్యం. అంటే మామూలుగా ఎవరూ చేయలేని పనిని చేయగలగడం.

**తేజస్సు:** పరాభిభవన సామర్థ్యం. అంటే ఎదుటివారిని లొంగ దీసుకోగల శక్తి. ఆనాడు కౌరవుల వద్దకు రాయబారానికి వెళ్ళిన శ్రీకృష్ణుడు "కురూన్





ప్రచ్ఛాదయన్ శ్రియా" అన్నట్లుగా, తన కాంతితో వారిని ఆక్రమించేసేడు కదా! ముండకోపనిషత్తు చెప్పింది. 'తమేవ భాన్తం అనుభాతి సర్వం' అన్నింటిని తన తేజస్సుచేత ప్రకాశింప చేసేవాడు ఆ పరమాత్మే.

పైన చెప్పిన 'జ్ఞాన బలైశ్వర్య వీర్య శక్తి తేజస్సు' అనే ఈ ఆరుగుణాలూ సృష్టిలో ఉన్న అన్నిటికీ, అందరికీ ఉపయోగించేవే! ఇంక ఆశ్రితుల విషయంలో ప్రవర్తించే 12 గుణాలను ఇప్పుడు వివరిస్తున్నారు.

**సౌశీల్యం:** సౌశీల్యం అంటే తెలుసుకునే ముందు శీలమంటే ఏమిటో తెలుసుకోవాలి. 'మహతః మందై స్సనీరంధ్రేణ సంశ్లేషః' గొప్పవారు, తక్కువ వారితో అరమరికలు లేకుండా కలసి ఉండడాన్ని శీలము అంటారు. ఆ కలసినప్పుడు మనసులో కూడా ఆ కలసినవారు తనకన్న తక్కువవారు అనే భావన కూడా లేకుండా ఉండడాన్నే సౌశీల్యము అంటారు.

రామచంద్రప్రభువు నర, వానర, రాక్షసులతో చెలిమి చేసుకోవడమే కాక నువ్వు సాక్షాత్తుగా నారాయణుడవయ్యా అని దేవతాశ్రేష్ఠులు విన్నపం చేసినా, కాదు కాదు "ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజం" అని తన మనసులో కూడా తాను భగవానుడనని భావింపకుండా, నేను మానవుడిని, నాపేరు రాముడు. మా నాన్నగారు దశరథుడు అంటూ చెప్పేడు.

**వాత్సల్యం:** ఆశ్రితులయొక్క దోషాన్ని ఇష్టంగా స్వీకరించడమే వాత్సల్యం. అప్పుడే పుట్టిన దూడమీద ఆవుకున్న ప్రేమను వాత్సల్యం అంటారు. దూడయొక్క మురికిని ముందుగా శుభ్రం చేస్తేకాని, ఎంతమంచి ఆహారాన్నైనా స్వీకరించదు. అలాగే స్వామి ఆశ్రితుల దోషాలను తొలగించడమే ఇష్టంగా స్వీకరించాడు. వాత్సల్యమంటే ఆశ్రితుల దోషాలు కనుపించకుండా ఉండే ప్రీతి.

**"గోపాలత్వం జుగుప్సితమ్"** గోపాలత్వమనేది హేయమైనది అని భావిస్తారు. అటువంటి నిహీనమైన జాతి తనదిగా స్వీకరించాడు స్వామి. ఇదీ వాత్సల్యం.

**మార్దవం:** మృదువుగా ఉండడమనేది శరీరానికి సంబంధించినగుణమే అయినా ఇక్కడ ఆత్మగుణములను సంబంధించిన ప్రకరణం కనుక ఇక్కడ మార్దవం అంటే, కఠినత్వంలేని స్వభావం కలిగి అందుబాటులో ఉండడం. ఆశ్రిత విశ్లేషాన్ని సహించలేని గుణం ఈ మార్దవం. శ్రీరామచంద్రుడు సీతమ్మను ఎడబాసి ఉన్నప్పుడు వాల్మీకి వర్ణిస్తాడు. "అనిద్ర స్సతతం రామః" రాముడు ఎప్పుడూ నిద్రలేకుండా ఉండేవాడట. అదీ మార్దవం అంటే.

**ఆర్జవం:** అంటే మనోవాక్కాయము లేక రూపంగా ఉండడం. భగవానుడు ఆశ్రితులతో కలియడానికి మనోవాక్కాయములన్నిటితోనూ ప్రయత్నిస్తాడు. ఆశ్రితుల అనార్జవమే ఆర్జవమా అన్నట్లుగా వారి విషయంలో తాను ఋజువుగా ఉంటాడు స్వామి.

**సౌహార్దం:** అందరి హితాన్ని కోరేవాడు సుహృత్. వానియొక్క భావం సౌహార్దం. **సు**=శోభనం(మంచి); **శం సతీతి**=కోరుకొనేవాడు. **సుహృత్**=అతని యొక్క భావం సౌహార్దం.

**సామ్యం:** సమత్వం. జాతి, గుణము, ప్రవర్తనలో ఉండే తక్కువ ఎక్కువలను పట్టించుకోకుండా, తనవైపు అభిముఖులైతే చాలు. ఎవరికైనా ఆశ్రయించడానికి అనుగుణంగా ఉంటాడు. ఈ లక్షణాలన్ని రామచంద్రునివద్ద చూస్తాం. **"గుహేన సహితో రామో లక్ష్మణేన చ సీతయా"** వనవాసానికి వచ్చినపుడు సీతా లక్ష్మణులతో కలసిన ఆనందాన్ని పొందేడట రాముడు. గుహుడు ఆటవికజాతివాడయినా రామునికి అమితమైన అభిమానం ఉన్నది. అదేవిధంగా శబరజాతి వనిత అయిన శబరి ఆరాధనను ప్రీతిగా స్వీకరించాడు. (శబర్యా పూజిత స్సమ్యక్) అంటాడు వాల్మీకి.

**కారుణ్యము:** 'స్వార్థనిరపేక్ష పరదుఃఖా సహిష్ణుత్వమ్' ఏమాత్రం తనకు లాభం లేకుండానే ఒకరి దుఃఖాన్ని పోగొట్టాలనే కోరిక. అంతేకాదు, స్వార్థ నిరపేక్షంగా, ఇతరుల దుఃఖాన్ని పోగొట్టక నిలువలేనిగుణం కారుణ్యం. ఈ లక్షణము మనం రాముని దగ్గర చూస్తాం. రాముని చూస్తూ అయోధ్యాపుర





పౌరులు పరవశించి రాముని గుణాలను వర్ణించే సందర్భంలో చెబుతారు. **"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః"** ఎవరైనా దుఃఖిస్తే వారికంటే ఎక్కువగా విచారించేవాడురాముడు.

**మాధుర్యం:** స్వామి స్వభావం చూసినా, రూపం చూసినా, ఆ స్వామి గుణాలు చూసినా, వాని ఐశ్వర్యాన్ని చూచినా సర్వతోముఖమైన స్వారస్య ముంటుంది. చంపడానికి వస్తున్నా ఆ అందం మనలను అలరిస్తూనే ఉంటుంది. దీనికి ఉదాహరణే "భీష్ముని" చెప్పుకోవచ్చు. రథంమీద నుండి చక్రము చేతపట్టి చంపవస్తున్నప్పుడు భీష్మడంటాడు "ఏహ్యేహి ఫుల్లాంబుజ పత్రనేత్ర" నీరజ పత్రనేత్రా రావయ్యా రా! అంటూ ఆ అందానికి పరవశించి పోయి పిలుస్తున్నాడు భీష్ముడు. శ్రీకృష్ణుడు పాండవదూతగా కౌరవసభకు వెళ్ళినపుడు అక్కడ వారందరికి కలిగిన ఆనందాన్ని ఈ విధంగా వర్ణిస్తాడు.

**అసూర్య మివ సూర్యేణ నివాత మివ వాయునా ।**
**కృష్ణేన సముపేతేన జహర్షే భారతం పురమ్ ॥**

సూర్యుడు లేని ప్రదేశం లోనికి సూర్యుడు వచ్చినట్లు, గాలిలేని చోట వాయువు ప్రసరించినట్లు నగరమంతా ఆనంద తరంగితమయిందట. ఆ విధంగా రసావహుడై ఉంటాడు స్వామి. "సర్వగంధః సర్వరసః' అన్నది ఉపనిషత్తు. అన్ని పరిమళాలు, అన్ని రుచులూ ఆ స్వామిలోనే ఉంటాయి. కనుక ఆ నందావహుడయ్యే ఉంటాడు.

**గాంభీర్యం:** గాంభీర్యం అంటే లోతు అని అర్థం. లో లోపల మనోభావాలను బయటకు వ్యక్తపరచకపోవడం. భగవానుడు ఆశ్రితులకు ఏమేమి చేయాలనుకుంటున్నాడో దానిని ఒకరికి తెలుసుకుందుకి వీలులేకుండా ఉండడమే! తన గొప్పతనాన్ని ఆశ్రితుని తక్కువతనాన్ని ఎరుగకుండా ఉండడం. ఆశ్రితులకు ఎన్నో చేసినా ఏమీ చేయనట్లే ఉంటాడు. అదేగా గాంభీర్యం.

**"య ఆత్మదా బలదా"** అంటుంది ఉపనిషత్తు. తనను తాను

ఇచ్చుకుంటాడు. తనను అనుభవించగలిగిన శక్తినికూడా స్వామే అందిస్తాడు.

**ఔదార్యం:** ఆశ్రితులకు కావలసిన వానిని వారిని బ్రతిమాలి మరీ అందించేవాడు. పుచ్చుకొనేవాడు తగిన యోగ్యత గలవాడు కాకపోయినా, తానిచ్చేది చాలా విలువయినదైనా, పుచ్చుకున్నవారు ప్రత్యుపకారం చేయగలిగిన వారు కాకపోయిన ఇవ్వడమే ఔదార్యం.

అయోధ్యాకాండలో రామచంద్రుడు దానాలు చేసిన సందర్భంలో చెబుతారు. **'స సర్వానర్థినో దృష్ట్వా సమేత్య ప్రతినన్ద్య చ'** అడిగేవారిని చూచి వారిని ఆదరించి ఆనందింపచేసి వారికి కావలసినది అందించేవాడు రాముడు. భగవానుడు గీతలో అంటాడు. **"ఉదారస్సర్వ ఏవైతే"** నన్నడిగిన వారందరూ ఉదారులే అంటాడు. తనను అడగడమే ఔదార్యమని భావించేటంత ఔదార్యము కలిగినవాడు స్వామి.

**చాతుర్యం:** నేర్పు, ఆశ్రితుల దోషాలను లక్ష్మీదేవికి కూడా కనిపించకుండా దాచేవాడు స్వామి. ఆశ్రితులు తన రక్షణ విషయంలో సందేహం కలిగి ఉంటే ఆ సందేహాన్ని పోగొట్టి రక్షించడం కూడా చాతుర్యమే! ఈ చాతుర్యం మనం సుగ్రీవ రక్షణంలో చూస్తాం. వాలిని చంపి నిన్ను కాపాడుతానయ్యా! అని చెబితే పూర్తిగా నమ్మకం కలగలేదు సుగ్రీవునకు. పోనీలే, ఆనాడు మీ అన్న చంపిన దుందుభి కాయాన్ని 10 యోజనాల దూరం విసిరివేస్తాను చూడు అని విసిరివేసినా నమ్మకం కలుగలేదు. అప్పుడు సప్తసాల వృక్షాలను ఒకేబాణంతో కొట్టి వానికి నమ్మకం కలిగించి మరీ సుగ్రీవుని కాపాడాడు రామచంద్రుడు ఇదీ చాతుర్యం.

**స్థైర్యం:** ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆశ్రితుని రక్షించే ప్రతిజ్ఞలో కొరత లేక ఉండడం. విభీషణుడు శరణుకోరినప్పుడు, సుగ్రీవాదులు వలదని వారించినా వినక **'నత్య జేయం కథంచన'** నేను వదలలేను అని స్వీకరించడం దీనికి ఉదాహరణ. పైన చెప్పిన 12 గుణాలూ ఆశ్రితులకుపయోగపడేవి.

ఇప్పుడు చెప్పబడే మూడు గుణాలూ ఆశ్రిత విరోధుల విషయంలో





ఉపయోగడపడేవి.

**ధైర్యం:** శత్రువులను లెక్కచేయకపోవడం. లంకలో రావణుడు, వాని సైన్యం కనికందకుండా ఉండగానే వాని తమ్ముడైన విభీషణునికి సముద్రపు ఇవతలనే ఉండగానే పట్టాభిషేకం చేసేసాడు కదా! రావణుని మూలబలం ఎదిరించినప్పుడు ఏమాత్రం మనసులో తల్లడపాటు లేకుండా మార్పు లేకుండా ఉన్నాడు.

**శౌర్యమ్:** అసహాయంగా శత్రుసైన్యంలో ప్రవేశించినా స్వంతసైన్యంలో ప్రవేశించినట్లు ప్రవేశించడం శౌర్యం. రామచంద్రుని పైకి పరసైన్యాలు వచ్చి బాణపరంపరను గుప్పించినపుడు, తిరిగి తాను బాణాలను ప్రయోగించి "ఛిన్నం భిన్నం, శరైర్దగ్ధమ్" అన్నట్లుగా ఎదుటివారి శరపరంపరలను విరిచి ముక్కలుచేసి నశింపచేసిన రామచంద్రునిది శైర్యమంటారు.

**పరాక్రమము:** ఆ స్వామి విల్లుచేతబట్టి బాణపరంపరను గుప్పిస్తున్నప్పుడు చూడాలి, ఆ స్వామి ఆయుధ ధారియై సంచరిస్తూ ఉంటే శత్రువులు దర్పించి వశపడి పోతారు. "ప్రహర్తారం శరీరేషు" అని రాముని గురించి చెబుతున్నారు.

ఇంక ఆశ్రితలకు ఉపేయము (పొందవలసినది) ఉపాయము (పొందించేవాడు) భగవానుడే అనే విషయాన్ని తెలియచేసే విశేషగుణాలను నాలుగింటిని తెలియచేస్తున్నారు.

**సత్యకామ:** కామమంటే అనుభవింప వలెనని కోరుకొనే విషయం. ఆ స్వామి కావాలనుకొనేవి నిత్యమై ఉంటాయి. ఏమిటవి? ఆశ్రితులనుభవించి, పరవశించే తనగుణములు, ఐశ్వర్యము మొదలయినవి. **కామ్యన్త ఇతి కామః** అంటారు. కోరుకొనేవి ఏవో అవి కామములు. ఆశ్రిత రక్షణ విషయంలో ఆ స్వామికుండే కోరిక. అది ఎప్పుడూ నెరవేరుతూనే ఉంటుంది కనుక సత్యకాముడు ఆ స్వామి.

**సత్యసంకల్పుడు:** కోరుకున్న వాటిని ఏ అడ్డంకి లేకుండా అనుభవించ గలిగినవాడు స్వామి. ఏమిటవి? ఆశ్రితులు వింత వింత కోరికలు కోరుకుంటూ ఉంటారు. ఏదో నన్ను రక్షించేస్తే చాలదయ్యా?" "కాణవారాయ్" నాకు కనబడేలా ఎదురుగా వచ్చి దర్శనమీయవయ్యా! అని కోరుకున్న వారిని అనుగ్రహించడానికి దేవతలలో దేవతగా, మనుష్యులలో మనుష్యుడుగా ఇంకా ఎన్నో విధాలుగా అవతరిస్తాను, అనుకుంటాడు. అంతే, అసాధ్యం సాధ్యమయి పోయింది. స్వామి అవతరించి వారిని తరింపచేసేడు.

**కృతిత్వము:** కృతిత్వమంటే పరోపకారిత్వము. ఒకరికి పనిచేసి తాను పొంగిపోవడం. ఆశ్రితుల కోరిక పూర్తయి ఉంటే పొంగిపోయేవాడీ స్వామే!

ఈ గుణాన్ని రామాయణం మనకు చక్కగా దర్శింపచేస్తుంది. విభీషణునికి పట్టాభిషేకం చేసిన తరువాత

**"అభిషిచ్య చ లంకాయామ్ రాక్షసేంద్రో విభీషణః**

**కృత కృత్య స్తదా రామో విజ్వరః ప్రమోదహః"** లంకకు విభీషణుని పట్టాభిషిక్తునిచేసి రాముడు తాను కృతకృత్యుడను అనుకున్నాడు. తాను తాపాన్ని పోగొట్టుకున్నాడు. అదీ స్వామియొక్క గుణం. అదీ కృతిత్వం. ఆశ్రితులు చేయవలసిన పనులను, తనమీద పెట్టుకొని తానే చేసి పెట్టడం.

**కృతజ్ఞత:** ఎవరైనా చేసిన మంచి పనిని మరచిపోకపోవడం. ఎవరైనా ఒకసారి "స్వామీ నీశరణాగతుడను అంటే చాలు, తరువాత వారు చేసిన దోషాలను చూడకుండా ఆ శరణాగతుని రక్షించడం కృతజ్ఞత". ఆశ్రితులకు తానెంత చేసేనన్నది మరచిపోయి, ఒక్కసారి ఆశ్రితుడు 'శరణు' అన్నాడు అనే విషయాన్నే గుర్తుపెట్టుకొనేవాడు.

భరతుడు వచ్చి వెనుకకు రమ్మని యాచించినప్పుడు తిరిగి వెళ్ళలేక పోయేనే అంటూ **'శిరసాయా చితస్తస్య వచనం న కృతం మయా'** తలవంచి కోరేడే, వినయంగా ప్రార్థించాడే, నేను ఆ చిన్నితమ్ముని కోరిక నెరవేర్చలేక పోయేనే! అని వాపోతాడు రామచంద్రుడు.





ఈ విధములైన గుణములు గలవాడు పరమాత్మ. ఆ గుణములెన్ని? ఎటువంటివి అనే విషయాన్ని ఇంకా తెలియచేస్తున్నారు.

స్వామీ! నా మనసుకు అందిన కొన్ని కల్యాణగుణములను చెప్పేను. అన్నీ కల్యాణగుణములే! అందరికీ మేలు చేసేవే! నీ గుణములు. నేను చెప్పలేక మిగిలిపోయిన గుణాలు ఎన్నని చెప్పను? అంటున్నారు రామానుజులు. ఒక పెద్ద సముద్రంలో జలపరమాణువులు ఎన్ని అని చెప్పగలిగితే భగవంతుని గుణాలను గురించి చెప్పగలమట. భారతంలో కర్ణపర్వంలో దుష్టచతుష్టయంలో ఒకడైన కర్ణుని నోట వచ్చిన మాట చూద్దాం.

**"వర్షాయుతైః యస్య గుణాః న శక్యాః వక్తుం సమేతైరపి సర్వలోకైః మహాత్మనః శంఖ చక్రాసి పాణేః విష్ణోః జిష్ణోః వసుదేవాత్మజస్య"**

శంఖ చక్రాది ఆయుధధారి అయిన వసుదేవనందనుని గుణాలను చెప్పాలని సర్వలోక వాసులూ కలసి పదివేల సంవత్సరాలు చెప్పదలచుకున్నా చెప్పడానికి సాధ్యం కానివి స్వామి కల్యాణగుణాలు. వరాహపురాణంలో **చతుర్ముఖాయుర్యది కోటి వక్త్రః** చతుర్ముఖుని కున్నంత ఆయుస్సు ఉండి, ఆ వ్యక్తికి కోటిముఖాలు ఉన్నా భగవంతుని గుణాలను చెప్పలేము అని తెలియచేసింది. అందువలన స్వామి కల్యాణగుణములు అసంఖ్యేయము లంటున్నారు రామానుజులు.

పైన చెప్పిన కళ్యాణగుణములు కలవారు ఎవరు?

ఆ కళ్యాణగుణవిశిష్టుడై ఉపనిషత్తులలో పరబ్రహ్మ అనీ, పురుషోత్తముడనీ తెలియచేయబడినవాడు.

**పరంబ్రహ్మభూతం:** బ్రహ్మ అంటే ముందుగా తెలుసుకుందాం! బృహతి, బృంహయతి అనే రెండు నిర్వచనాలను తెలియచేసేరు. పెద్దగా ఉండేవాడు, పెద్దగా చేసేవాడు పరమాత్మ.

తాను **"అంతః బహిశ్చతత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః"** అన్నట్లుగా

అంతటా వ్యాపించి ఉండేవాడు కనుక బ్రహ్మ. అంతేకాదు తనను ఆశ్రయించేవారికి **"మమ సాధర్మ్యమాగతాః"** అని గీతలో చెప్పినట్లుగా, తమతో సమానమైన స్థితిని కల్పిస్తాడు కనుక, బృంహయతి. మళ్ళీ జన్మ లేకుండా తనంత వారినిగా చేస్తాడు. అంటే పెద్దగా చేస్తాడు. కనుక బృంహయతి అని చెప్పవచ్చు. అంతేకాక ప్రళయకాలంలో నామరూప విభాగం లేకుండా తనలో చేరి ఉన్న జీవ, ప్రకృతులను సృష్టికాలం వచ్చేక శరీరాన్ని, ఇంద్రియాలను ఇచ్చి పెద్దగా చేస్తాడు. కనుక, ఈ స్వామి బ్రహ్మ. నిరుక్తకారుడు. (నిరుక్తము అంటే వేదంలో ఉన్న పదాలకు అర్థము చెప్పిన డిక్షనరీవంటిది.) బ్రహ్మ పరిభృడం సర్వత్ర అంతట వ్యాపించి పెద్దగా ఉండేదే బ్రహ్మ అని నిర్వచించింది. బ్రహ్మ అంటేనే ఈ విధంగా అర్థం నిర్ణయించబడినా, లోకంలో ఇంకా కొన్నిటికి కూడ బ్రహ్మ అనే వ్యవహారం ఉండడం వలన వాటికంటే పెద్దది అని చెప్పడానికి పరంబ్రహ్మ అని ఇక్కడ వ్యవహరిస్తున్నారు.

**పురుషోత్తమః:** భగవానుడు పుషోత్తముడు. ఈ విషయాన్ని భగవద్గీతలో తెలియచేసేడు.

**"యస్మాత్ క్షరమతీతోహం అక్షరాదపి చోత్తమః**
**అతోస్మి వేదే లోకేచ ప్రథితః పురుషోత్తమః"**

నశించే ప్రకృతికన్నా, నశించని జీవునికన్నా వేరయినవాడిని నేను. అందువలన నన్ను వేదము, లోకము కూడా పురుషోత్తముడంటుంది. పురుషోత్తమ శబ్దానికి నిర్వచనం చూద్దాం! 'పురు అంటే ఎక్కువ అని అర్థం. సునోతి అంటే ఇచ్చేవాడు. అధికంగా ఇచ్చేవాడెవడో వాడు పురుషుడు. సర్వాపేక్షిత ఫలప్రదుడు కనుక పురుషోత్తముడు.

**శ్రీరంగశాయినమ్:** శాస్త్రాలలో చెప్పబడడం మాత్రమే కాక శ్రీరంగ మందిరంలో అందరికీ దర్శనమిచ్చేలా వేంచేసి ఉన్నవాడు. కనులు మొగిడించి స్వామియొక్క సౌలభ్యానిన తలచుకొని పరవశిస్తున్నారు. భగవద్రామానుజులు.





**అస్మత్స్వామినం:** **'కిడన్తదోర కిడక్కై'** అన్నట్లుగా ఒకేవిధంగా ఆశ్రితుల కొరకై పవళించి ఉండి, అందంతో, సౌశీల్యంతోను, నాకు తనతో ఉండే సంబంధాన్ని స్థిరపరచాడు ఆనాడు లక్ష్మణుడు. **'గుణైర్దాస్య ముపాగతః'** అన్నట్లు గుణములకు వశపడి దాసుడనయ్యేలా చేసేడు అంటూ పరవశిస్తున్నారు రామానుజులు.

ఇంతవరకు ఎవరివద్ద సేవచేయాలి అనే విషయాన్ని చెప్పేరు. ఇప్పుడు కైంకర్యం చేసే జీవ స్వరూపమెలా ఉంటుందో తెలియచేస్తున్నారు. తమ స్వభావం చెబుతున్నారు. స్వామి కైంకర్యాన్ని చేయబూనిన తమ స్థితిని తెలియచేస్తున్నారు రామానుజులు.

**ప్రబుద్ధమ్:** **ప్రకర్షేణావగతమ్.** బాగా తెలిసిన నియమింపబడి ఉండేది ఆత్మ. నిత్య నియామ్యము ఆత్మ. ఎప్పుడూ భగవానునిచే నియమింపబడేది ఆత్మ. ఎల్లప్పుడు భగవంతునికి దాసుడయి అందులోనే ఆనందాన్ని అనుభవించడమనే లక్షణం ఎప్పుడూ జీవాత్మకుండాలి. ఇటువంటి లక్షణములు కలిగినది నా ఆత్మ అని రామానుజులు తెలియచేస్తున్నారు.

నిత్యము దాస్యములోనే ఆనందమును అనుభవించే లక్షణము ఆత్మకు సహజం. దానిని తాము కలిగి ఉన్నామని రామానుజులు తెలియచేస్తున్నారు. దీనివలన స్వాతంత్ర్యము. ఇతర విషయ ప్రావణ్యము ఉంటే ఆత్మ నశించినట్లే లెక్క అని తెలియచేస్తున్నారు.

భగవద్విషయికమైనదే జ్ఞానం. జ్ఞానానికి విషయమై అదే భక్తికి విషయమై ఉండే స్థితి వీరిది. అంటే భగవదనుభవానికి కారణమైన పరభక్తి, పరజ్ఞాన, పరమభక్తులు వీరికి నిండుగా ఉన్నాయి అని తెలుస్తున్నది.

పరభక్తి: ప్రత్యక్ష సమానంగా భగవానుని అనుభవించడం పరభక్తి. అంటే ఇంద్రియాలతో అనుభవించినంత **స్పష్టంగా** భగవంతుని దర్శన స్పర్శాదులు కలగడం.

**పరజ్ఞానం:** జ్ఞానాన్ని స్థిరీకరించుకోవడం.

**పరమాభక్తి:** విచ్ఛేదంలేని భగవదనుభవం, అనుభవించాలనే తపన.

ఇందులో మొదటిది విశదమైన అనుభవం.

రెండవది విశదతరమైన అనుభవం.

మూడవది విశదతమమైన అనుభవం.

మూడవ స్థితే పరిపూర్ణానుభవం. ఈ స్థితిలో మరి ఏ ఇతర విషయములు మధ్యన వచ్చి మనసును కల్లోల పరచకుండా భగవద్భావనే సంతతం సాగుతుంది. ఇది కలిగి ఉండాలి అని కోరుకుంటున్నారు భగవద్రామానుజులు. ఇదే మనందరం కోరుకోవలసిన విషయం.

పైన చెప్పిన భగవదనుభవం కలగగానే అపురూపమయిన ఒక ప్రీతి కలుగుతుంది. దానితో స్వామికి ఏదో ఒక సేవచేయాలనే ఆర్తి మొదలవుతుంది. ఆ విధంగా కలిగిన కోరికతో చేసే భగవానుని సేవలు ఆరంభమవుతాయి.

ఇప్పుడు ఏ సమయంలో సేవచేయాలి అనే నియమముండదు. అన్తః పురంలోనైనా, సభామండపంలోనైనా, పూదోటలోనైనా, నీటిబావివద్దనైనా సరే ఏదో ఒక విధమైన సేవ చేయాలి. పర, వ్యూహ, విభవ, అర్చ ఎవరివద్దనైనా చేయాలి అనే కోరిక కలుగుతుంది. ఆ కోరికనే భగవానునివద్ద ఆవిష్కరిస్తున్నారు. భగవన్ నేనో విధమైన కైంకర్యం చేయగల వానిని అగుదునుగాక అనేది ఇప్పుడు వీరి ఆకాంక్ష. ఆ చేసే కైంకర్యంలో తృప్తిలేక, ఏవేవో, ఎన్నెన్నో సేవలు చేసేయాలనే తపన కలుగుతుంది.

పరమపదంలో ఆదిశేషుడు స్వామికి కైంకర్యము చేసే విధానం చూడాలి. **"నివాస శయ్యాసన పాదుకాంశు కోపధాన"** అన్నట్లుగా తానే ఆవాసమయి, తానే పవళించే శయ్య అయి, ఆసనములు, పాదుకలయి, ఇలా ఇలా ఎన్ని రకాలుగా సేవలు చేయగల్గిగితే అన్ని రకాలుగా చేస్తాడు. అదే ఇప్పుడు మన రామానుజుల కోరిక. ఆ పరమపదంలో ఉండే ముక్త పురుషాదులు, ఒకసారి





చక్కని పూవుల చెట్టయి, స్వామి విహారయాత్రగా వచ్చినపుడు జల్లున పూవులు కురిపించి, స్వామి అలసినపుడు తామే వింజామర అయి వీచి, సేదతీరుస్తారు. ఇదేవిధమయినసేవ చేయాలనేదే మన ఎంబెరుమానార్ వాంఛితం.

రామాయణంలో దశరథునికి కౌసల్య చేసే సేవలు వర్ణిస్తూ చెప్తారు. **"యదాయదాహి కౌసల్యా దాసీవచ్చ సఖీవచ, భార్యావత్, భగినీ వచ్చ మాతృ వచ్చో పతిష్ఠతిః"** ఇందులో కౌసల్య భార్యలా, దాసీలా సేవలు చేసింది. అంటూ చెల్లెలులా సేవ చేసింది అని కూడా అన్నారు. చెల్లెలులా సేవ ఏం చేసి ఉంటుంది అని వ్యాఖ్యాతలు పరిశోధించి ఒక నిర్ణయానికొచ్చారు. దశరథుడు అనేకమందిని భార్యలుగా స్వీకరించాడు కదా! క్రొత్త భార్య వచ్చినప్పుడల్లా హారతిచ్చి, దిష్టితీసి లోపలికి తీసుకొని వెళ్ళేది. అది విచిత్రమైన సేవ. భర్తకు ఆనందాన్ని కలిగించే ఏ సేవ అయినా అది కౌసల్యకు ఇష్టమే! అదేవిధంగా భగవానునికి ఆనందావహమయిన సేవ చేయాలి. అనేది వీరి కోరిక.

అయితే ఈ కైంకర్యము ఎంతకాలం సాగుతుందని, సాగాలని వీరభిమతమో, చెబుతున్నారు. దీనికి ఒక అవధి ఉండకూడదు. అలా అలా ఈ కైంకర్యం సంసేవనం జరుగుతూనే ఉండాలి, అనేది వీరి కోరిక.

శరణాగతి నిష్ఫలకైనా, ఉపాసకులకైనా ఫలమీ కైంకర్య ప్రార్థనయే! దీనిని ద్వయంలోని రెండవ భాగం (శ్రీమతే నారాయణాయ నమః)లో తెలియచేయబడింది. అదే విషయాన్ని ఇంతవరకు ఈ గద్యంలో చెప్పబడింది.

**మూలం :**

> **స్వాత్మ నిత్యనియామ్య నిత్యదాస్యైకరస ఆత్మ స్వభావాను సంధానపూర్వక భగవదనవధికాతిశయ స్వామ్యాద్యఖిల గుణగణానుభవజనిత అనవధికాతిశయ ప్రీతికారిత అశేషావస్థోచిత అశేష శేషతైక రతిరూప నిత్యకైంకర్య ప్రాప్త్యుపాయ (భూత) భక్తి తదుపాయ సమ్యక్ జ్ఞాన తదుపాయ సమీచీన క్రియా తదనుగుణ సాత్విక తాస్తిక్యాది**

సమస్తాత్మగుణ విహీనః దురుత్త రానంత తద్విపర్యయ జ్ఞానక్రియా గుణానాదిపాపవాసనా మహార్ణవాంతర్నిమగ్నః తిలతైలవ, ద్దారు వహ్నివ, ద్దుర్వివేచ త్రిగుణ క్షణ క్షరణస్వభావాచేతన ప్రకృతి వ్యాప్తిరూప దురత్యయ భగవన్మాయా తిరోహిత స్వప్రకాశః అనాద్యవిద్యా సఞ్చితానంతా శక్యవిస్రంసన కర్మపాశ ప్రగ్రథిత అనాగాతానంత కాలసమీక్షయాఽ_ పృదృష్టసంతారోపాయ,

నిఖిలజంతుజాతశరణ్య! శ్రీమన్నారాయణ!
తవచరణారవిందయుగళం శరణమహం ప్రపద్యే॥

తాము పొందవలసినదేమిటో చెప్పేరు. సరే దానిని పొందాలంటే బోలెడన్ని అర్హతలుండద్దూ! అవేవీ తమలో లేవే! ఎలాగ అని భయం వేసింది. సరే వైద్యుని దగ్గరకు వెళ్ళి నాకు ఈ విధమయిన అనారోగ్యముంది అని చెప్పకపోతే ఎలాగ?! చెప్పాలి. పొందవలసినది పొందడానికి వేరొకదారి లేదు. అనన్యగతిని, పోనీ నేనేమైనా స్వంతంగా సంపాదించుకోగలవాడినా, నాశక్తి అంటూ నాకేమీలేదు. అకించనుడను. అంతేనా చేసిన పాపాలా బోలెడన్ని. మరీ ఇన్ని అవకరాలున్నవాడిని నీవుగాక మరెవరయ్యా రక్షిస్తారు? అంటూ భగవత్పదసన్నిధిన శరణాగతి చేస్తున్నారు భగవద్రామానుజులు.

అయితే అసలు సిసలైన ఆత్మతత్త్వం మనసున మెదలి అబ్బ నా ఆత్మ(నేను) ఎంత మంచి లక్షణాలు గలది అనిపించిది కాబోలు, ఒక్కసారి ఆత్మలక్షణమేమిటో తలంచుకొని మురిసిపోతున్నారు భగవద్రామానుజులు.

ఆత్మ ఎప్పుడూ భగవన్నియమనానికి లోబడి ఉండేది. ఎప్పుడూ భగవద్దాస్యాన్నే కోరుకొనేది. దానియందే ప్రీతికలిగి ఉండేదీ ఈ ఆత్మ అని తృప్తితో ఉన్నారు. ఇంక శరణాగతి చేసేస్తే, ఆత్మకు గల సహజ లక్ష్మణాలు అభివ్యక్తమయి ఫలితాన్ని పొందుతామనే ఆనందంతో "స్వాత్మ" నా ఆత్మ అంటున్నారు. ఇంక ఆ అనుభవం ఎవరివలన కలుగుతుందో ఆ స్వామిని





తలచుకొని ఆ స్వామిలో ఉన్న కల్యానగుణాలు మనసున నిండిపోయి తృప్తితో వానికి చెందిన తమ ఆత్మ ఒక్కసారి తలంచుకుంటున్నారు. ఇటువంటి జీవునకు, అటువంటి పరమాత్మకు ఉన్న సంబంధం తలంచుకొని నా ఆత్మ నిత్యనియామ్యము అంటూ తృప్తితో వెనుక చెప్పిన విషయాన్నే మళ్ళీ ఉటంకిస్తున్నారు. అబ్బ ఎన్ని మంచిగుణాలు కలవాడో కద పరమాత్మ అనుకుంటే ఆనందం. ఆ స్వామికే చెందినది కదా అని తన ఆత్మను తలచుకుంటే ఆనందం కలుగుతుంది వీరికి. ఇందులో ఆత్మను గురించి చెబుతూ "నిత్య నియామ్య, నిత్య దాస్యైకరసాత్మ స్వభావ" అంటూ నిత్యశబ్దాన్ని వాడారు. భగవంతుని ఆశ్రయించి వేరే ఏవేవో ఫలితాలను కోరేవారు కూడా. ఒకప్పుడు నియామ్యులే.

ఒకప్పుడు దాసులే! కాని, అలా కాకూడదు. ఎప్పుడూ ఆ లక్షణాలు విడనాడని లక్షణం ఆత్మస్వరూపం. అది తమ స్వంతం కావాలని కోరుకుంటు న్నారు భగవద్రామానుజులు. భగవానుడే తమకు స్వామి. తాము ఆ స్వామికి సొత్తు అనే విషయాన్ని చెబుతూ, ఆ స్వామియొక్క స్వామిత్వమెటువంటిదో చెబుతున్నారు. "అనవధికాతిశయ"మైన స్వామిత్వం భగవానునిది. ఒక ఉపాధి వలన అంటే శరీర సంబంధం వలన కలిగిన స్వామిత్వమయి ఆ శరీరమంతమయి పోతే పోతుంది. ఎంతటి మహరాజులైనా, చక్రవర్తులైనా, జీవితమంతమయిపోతే మరి ఆ సామ్రాజ్యం వారిది కాకనే పోతుంది కదా! వారు ఆ సామ్రాజ్యానికి ఎల్లప్పుడు స్వాములయి ఉండరు. అందువలన "అనవధికాతిశయ" అంతులేని అన్నిటికన్న మించిన స్వామిత్వము అని ఎంబెరుమానార్ తెలియచేస్తున్నారు. ఇటువంటి భగవానుని కైంకర్యం లభించడమే ముఖ్యమైన ఫలం. దీనికి కావలసినదేమిటి? భక్తి ఉండాలి. భక్తి అంటే ఏమిటి? భగవంతునియందు నిరవధికమైన ప్రీతి.

"తైలధారవత్" అవిచ్ఛిన్న స్మృతి సంతానమే" భక్తి అంటారు. మధ్యలో

విచ్ఛేదం లేకుండా నూనెధార పడ్డట్టుగా తలంపులన్నీ భగవంతునిపైకే ప్రసరించడమే భక్తి, శమము, దమము అనే బాహ్యేంద్రియ, అంతరింద్రియ నిగ్రహాలతో మొదలై ఆస్తిక్యం వరకూ సాగేది భక్తి. ఇది కలిగితే వెంటనే ఈ భక్తి ద్వారా భఘువదనుభవం లభిస్తుంది.

సరే, ఈ భక్తి కలగాలంటే ఏముండాలి? సమ్యక్ జ్ఞానముండాలి. సమ్యక్ జ్ఞానమంటే మంచిజ్ఞానం. ఏమిటీ జ్ఞానం? భగవంతుని స్వరూప స్వభావాదులు, తనయొక్క (ఆత్మ) స్వరూప స్వభావాలు స్పష్టంగా తెలియడం. భగవంతుని వైశిష్ట్యం. తన దాసత్వం ప్రస్ఫుటంగా తెలియడం. ఆ స్వామిపై అవధిలేని ప్రేమ ఏర్పడుతుంది. అదేభక్తి. అందువలన భక్తి కలగాలంటే దానికి ముందు ఉండవలసినది మంచిజ్ఞానమన్నమాట.

ఈ జ్ఞానం ఎలా మన స్వంతమవుతుంది. దీనికి ముందుగా కర్మాచరణ దోషరహితమై సాగాలి. అంటే, ఆత్మయొక్క యథార్థ స్వరూపాన్ని ఎరిగి, నేను చేస్తున్నాను. దీని ఫలం నాదే. ఈ చేసేపనిలో నాకు సంబంధమున్నది. అనే మూడుభావాలను వదలివేసి, మనం చేయవలసిన పనిని చేస్తూ నిశ్చితంగా ఉండడమే కర్మయోగం.

ఈ కర్మాచరణ అలవడాలంటే ముందుగా సత్త్వగుణం పెంపొందాలి. దానివలన భగవద్గీతలో చెప్పినట్లుగా "శమో దమస్త పశ్శౌచం క్షాంతిరార్జవ మేవ చ జ్ఞాన మాస్తిక్యమ్" బాహ్యేంద్రియ నిగ్రహం, మనసును అరికట్టుకోగలగడం, భోగానుభవములందు ఆసక్తి తగ్గి ఉండడమనే తపస్సును ఆవలంబించడం, లోనా బయటా కూడా శుచి అయి ఉండడం, ఓర్పు, మనసు, మాట, చేత ఏకరూపంగా ఉండడమనేది ఆర్జవం. భగవద్విషయికమయిన జ్ఞానం. వేదములపైనా, వేదవేత్తలపైనా పరిపూర్ణమైన విశ్వాసం కలిగి ఉండడం మొదలైన మంచిగుణాలు అలవడి ఉండాలి.

కానీ, ఇవేవీ లేకపోవడమే కాక దోసాకరులం మనం. మనందరి స్థితిని





తమపై ఆరోపింపచేసుకొని తమలో ఉన్న దోషాలను స్వామిముందు విన్నపం చేస్తున్నారు భగవద్రామానుజులు. ఇది వరకు కర్మజ్ఞానాదులేవీ స్వతంత్రంగా సంపాదించుకోలేని అశక్తుడను. అకించనుడను అని చెప్పేరు. ఇప్పుడు తమలోని దోషాలను తెలియచేస్తున్నారు. "అహిర్బుధ్న్య సంహిత" లో శరణాగతి చేసే పద్ధతిని తెలియచేశారు. "అహ మస్మ్యపరాధానాం" ఆలయః అకించనో అనన్య గతిః త్వమేవోపాయ భూతేషు భవేదితి ప్రార్థనామతిః శరణాగతిః" అంటూ తాను అపరాధాలకు నెలవు అనీ వేరొకదిక్కులేని వాడనని భగవానుడే తనకు ఉపాయమని బుద్ధి కలగడమే శరణాగతి అని చెప్పబడింది. అదే పద్ధతిలో రామానుజులు కూడా ఇక్కడ తమ దోషాలను భగవత్సన్నిధిని ఆవిష్కరిస్తున్నారు. వెనుక చెప్పిన కర్మజ్ఞానాదులు లేవు సరికదా! వాటికీ వ్యతిరేకమయిన లక్షణాలున్నాయే! అవేవీకూడా స్వప్రయత్నం చేత దాటడానికి సాధ్యమయినవి కావు. సామాన్యులకే కాదు, సనకాది మునీశ్వరులకు కూడా భగవదనుగ్రహం చేత మాత్రమే దాటడానికి సాధ్యమవుతాయి. కాని, స్వప్రయత్నం చేత సాధమ్యవవు. అటువంటి వ్యాపారాలు చేస్తూ అనాది అయిన పాపములచేత ఆక్రమింపబడి అదే పెద్ద సముద్రంలా ముంచేస్తూ ఉంటే అందులోపడి మునుగుతున్నామంటారు భగవద్రామానుజులు. మనం చేసిన కర్మవలన లభించిన చెడు ఫలితమే పాపము. ఈ పాపం వచ్చిందంటే మళ్ళీ పాపాలను సంపాదించే పనులను చేయిస్తూనే ఉంటుంది. ఈ విధంగా విషయవలయంలో మునిగిపోయి పాపాల కడలిలో మునిగిపోతున్నాను తండ్రీ అంటున్నారు రామానుజులు.

అసలు ఆత్మస్వరూపం జ్ఞానానందమయం కదా! మరి దీనికి పాపాలతో సంబంధ మేర్పడిందేమిటి? ఏముంది ఈ ప్రకృతిలో చేరి ఉండడంవలనే పాపాలతో సంబంధం ఈ ఆత్మకు ఏర్పడింది. ఈ సంబంధం ఎటువంటిది? "తిల తైలవత్, దారు వహ్నివత్" నువ్వులలో నూనె ఉన్నట్లు, కర్రలో నిప్పు

దాగి ఉన్నట్లు, ప్రకృతిచేత ఆవరింపబడి జీవుడున్నాడు.

ఉపాయం ఎరిగిన శక్తిమంతుడు తప్ప వేరెవ్వరూ ఆ రెండింటినీ విడదీసి చూడలేడు. అలాగే భగవదనుగ్రహం వలన మాత్రమే ఈ ప్రకృతి నుండి జీవుని వేరుగా దర్శించదరు. మనం చేసిన పాపాలననుసరించి భగవానుడు తన మాయను నియమిస్తాడు. ఆ మాయే ప్రకృతి. "మమ మాయా దురత్యయా" నా మాయ దాటరానిది అంటూ భగవద్గీతలో చెప్పేడు. "మాయాంతు ప్రకృతిం విద్ధి మాయినం తు మహేశ్వరమ్" అంటూ శ్వేతాశ్వతరోపనిషత్ కూడా మాయ అంటే ప్రకృతి అని చెప్పింది.

ఈ ప్రకృతికున్న లక్షణమేమిటి? సత్త్వరజస్తమో గుణములు కలిగి ఉంటుంది. సంతతము మారుతూ ఉంటుంది. ఇది జడము అంటే చైతన్య రహితము. ఆత్మకు ఈ ప్రకృతితో సంబంధం ఉండడం వలన ఆత్మను అజ్ఞానం ఆవరిస్తుంది. దానితో కర్మపాశాలు బంధిస్తాయి. ఇంక తాను కాని, ఇతరులుకాని ఆ బంధాన్ని ఛేదించలేరు. సహజంగా తనకుండే జ్ఞానం మరుగు పడిపోతుంది. జీవులను బంధించే కర్మ పుణ్యపాపరూపంగా ఉంటుంది. పుణ్యకర్మ అనుభవించాలి. సుఖపడాలి అన్నా, మళ్ళీ జన్మ, మళ్ళీ కర్మాచరణ, దాని ఫలం అనుభవించడానికి మళ్ళీ జన్మ ఇలా చక్రం పరిభ్రమిస్తూనే ఉంటుంది. కాలమంతా వెచ్చించి ప్రయత్నించినా దీనిని దాటే ఉపాయం వేరొకటి లేదు.

ఈ స్థితిలో తామున్నట్లుగా భావిస్తూ, మనందరి పరిస్థితి ఇదే సుమా అని సూచిస్తూ చేయవలసిన పనిని తాము చేసి చూపిస్తున్నారు భగవద్రామానుజులు. శ్రీరంగనాథుని సన్నిధిని శరణు కోరుతున్నారు. ఎవరా స్వామి "నిఖిల జన్తుజాల శరణ్యుడు" అయ్యో ఈ ఆశ్రయిస్తున్న వానిలో మంచిలక్షణాలు లేవే! చెడ్డలక్షణాలే ఉన్నాయే!! వీడిని కాపాడడమేమిటి? అనుకోడు. పాపం ఈ శరీరసంబంధం వీడికి కలిగింది. వీరా ఈ కష్టాన్ని





తొలగించుకోలేరు. వీరిలో ఎవరైనా ఆశ్రయిస్తే చాలు రక్షిద్దామని సిద్ధమయి ఉన్నవాడు, సుబాలోపనిషత్ చెప్పింది. "సర్వస్య శరణం సుహృత" అని సర్వులకు శరణ్యుడా సామే! అంటూ జితన్తాస్తోత్రం చెప్పింది. "సర్వలోక శరణ్యుడని" విభీషణుడాశ్రయించాడు.

అంతేకాదు, రాముడు స్వయంగా చెప్పిన మాట చూద్దాం! విభీషణ శరణాగతి సందర్భంలో, ఆశ్రయింప వచ్చిన వానిని తనదరికి తీసుకు రమ్మని సుగ్రీవునితో చెబుతూ,

**"విభీషణోవా సుగ్రీవయదివా రావణ స్వయమ్"**

"సుగ్రీవా! వచ్చినవాడు, విభీషణుడు కాక రావణుడే అయినాడనుకో వెనక్కు వచ్చేయకు, వానికయినా నేను శరణిస్తాను" అంటాడు. అందువలన అఖిల జన్తుజాత శరణ్య అంటున్నారు భగవద్రామానుజులు.

అయితే ఇంతటి కరుణార్ద్ర హృదయుడే అయినా ఈ జీవులుచేసిన తప్పుల వలన ఒక్కొక్కప్పుడు ఆ స్వామి కూడా ఆగ్రహం పొదచూపే ప్రమాదమున్నది. గీతలో చెప్పేడే **"తానహం ద్విషతః క్రూరాన్ సంసారేషు నరాధమాన్"** ఇటువంటి సమయంలో ఏం చెయ్యాలి? కాస్త ప్రక్కకి చూస్తే మనసులో ఆరాటం తగ్గుతుంది. తల్లి శ్రీదేవి చల్లని చూపుతో స్వామిలో కలిగిన తాత్కాలికాగ్రహం వెనుకకు పోతుంది. శ్రీమన్నారాయణుడు కనుక ఆ స్వామిని ఆశ్రయించడానికి మనకు జంకు అవసరం లేదని తెలుస్తున్నది.

నారాయణ: నారాయణలో ఉన్న సమాసానికి రెండు రకాలుగా విగ్రహ వాక్యాలు చెప్పినపుడు రెండురకాల అర్థాలు సిద్ధిస్తాయి. నారములు ఆధారముగా గలవాడు. నారములకు తాను ఆధారమయినవాడు. నారములు అంటే సర్వజీవ పదార్థాలూ భగవానునిలో చేరి ఉంటాయి. కనుక, నారములకు అయనమా స్వామి. సృష్టి జరిగిన తరువాత, మన శరీరమనే ప్రకృతిలోన ఉన్న జీవుడు, ఆ జీవుని ఆధారంగా చేసుకొని లోన పరమాత్మ. ఇప్పుడు నారములు

అయనముగా గలవాడు పరమాత్మ. అందువలన ఎంబెరుమానార్ "నారాయణ" అంటున్నారు. ఈ జీవులు భగవద్విముఖులై ఉన్నా వారి ఉనికిని వారు స్థిరపరచుకోలేని ప్రళయదశలో కూడా వెన్నంటి ఉండేవాడు. ఆ నారాయణుడే! కనుక, ఆ నారాయణుని పదసన్నిధిన శరణాగతి చేస్తున్నారు. 'స్వామీ! 'శ్రీమన్నారాయణ' ప్రక్కనున్న మీ ఆవిడను చూచినా, నీపేరులోనే ఉన్న సౌలభ్యాన్ని చూచినా నిన్నే ఆశ్రయించాలి అని స్పష్టంగా తెలుస్తోందయ్యా! స్వామీ! నీపదసన్నిధిన శరణాగతి చేస్తున్నాను' అంటున్నారు రామానుజులు. ఇక్కడ "శ్రీమన్నారాయణ తవ చరణార విన్దయుగళం శరణమహం ప్రపద్యే" అంటున్నారు శ్రీమత్‌లో లక్ష్మీసంబంధం.

చరణములు అనడం వలన, సులభముగా ఆశ్రయించదగినవని, ఒకదానికొకటి సరిజోడు అని తెలుస్తుంది. అరవిందములు అనడం వలన అప్పుడే విచ్చుకున్న జంటతామరలవలె సౌందర్య విరాజితములా పాదములని, సౌకుమార్య నిధానములా పాదములని, సుగంధ నిర్భరములు ఆ పాదములని తెలుస్తోంది. అటువంటి పాదములనే ఉపాయముగా స్వీకరించినవాడను నేను అంటున్నారు రామానుజులు.

### 3. మూలము:

**ఏవన్ మవస్థితస్యాపి అర్థిత్వమాత్రేణ పరమకారుణికోభగవాన్ స్వానుభవ ప్రీత్యోపనీత ఐకాన్తి కాత్యంతిక నిత్యకైంకర్యైక రతిరూప నిత్యదాస్యం దాస్యతీతి విశ్వాసపూర్వకం భగవంతం నిత్యకింకరతాం ప్రార్థయే ॥**

భగవానుడు తప్పక మనను రక్షిస్తాడు అనే విశ్వాసముంటేనే శరణాగతి ఫలిస్తుంది. అయితే ఆ విశ్వాసం కలగడానికి కారణమేమిటి? మనకున్న శక్తిని బట్టి మనకు ధైర్యం కలిగితే అది ఫలహేతువు. అందువలన భగవద్రామానుజులు చెబుతున్నారు.





"తండ్రీ! రంగనాథా! నేను అపరాధాలే చేసేవాడిని. ఏ స్వశక్తీలేనివాడిని. అయినా, నా ప్రార్థనకే దయతలచే వాడవయ్యా! నాకు నిన్ను పొందాలనే తొందరకాని, అడ్డంకులను దూరం చేసుకోవాలనే తపనకాని లేవు. కాని ఒక్కటే ఉన్నది. నీ కైంకర్యాన్ని పొందకపోయిన ఫరవాలేదు. అనే భావం లేదు. కావాలి అని నోటితో అన్నాను. వాటినే ఆధారంగా తీసుకొని నన్ను అనుగ్రహించే కరుణాంతరంగుడివి. కనుక, నన్ననుగ్రహించి, నీదాస్య లాభాన్ని అందిస్తావనే విశ్వాసంతో ఉన్నానంటున్నారు. "స్వామీ! నేనీ జన్మపరంపరావలయంలో పరిభ్రమిస్తున్నాను. నన్ను చూస్తే జాలి కలిగి కాపాడుతావయ్యా!" అంటున్నారు.

రామాయణంలో అయోధ్యాపురవాసులు రాముని కళ్యాణగుణములు కీర్తిస్తూ అంటారు. **"వ్యసనేషు మనుష్యాణాం భృశం భవతి దుఃఖితః"** ఎవరికైనా ఆపదవస్తే వారి వ్యక్తిత్వాన్ని కాని, వారితో తనకు గల సంబంధాన్నికాని చూడలేదు. సాటి మనుషులయితే వారి కష్టానికి, వారికన్నా ఎక్కువగా బాధపడే వాడు రామచంద్రుడు. అటువంటి కరుణాంతరంగుడు కనుక తమను కాపాడతాడని విశ్వాసం కలిగి ఉన్నారు భగవద్రామానుజులు.

ఆ స్వామిని 'భగవన్' అని సంబోధిస్తున్నారు. **భ**=జ్ఞానము, శక్తి; గ=బలము, ఐశ్వర్యము; **వ**=వీర్యము, తేజస్సు అనే ఆరుగుణాలు కలవాడు పరమాత్మ. చివరనున్న 'అన్' అనేపదం వలన హేయగుణరహితుడు అని తెలుస్తోంది. ఇటువంటివాడు కనుక శరణాగతునికి కావలసిన దానిని తెలుసుకొనగలడు. అందించగలడు అనే, ధైర్యంతో తమ విశ్వాసాన్ని భగవద్రామానుజులు ఇక్కడ తెలియచేయడానికి భగవశ్ఛబ్దాన్ని వాడేరు. కారుణికుడు కనుక నాకు అర్హత లేకపోయినా ఫలితాన్ని అందిస్తాడు. "భగవానుడు కనుక నా పనిచేసిపెట్టగలడు" అంటూ తృప్తిగా ఉన్నారు.

అయితే తమ కోరిక ఏమిటో స్పష్టంగా చెబుతున్నారు. నేను అనబడే ఈ ఆత్మ తత్త్వమున్నంత వరకూ (అంటే ఎల్లప్పుడూ) భగవద్దాస్యం తమకు

లభించాలనేదే వీరి కోరిక. దానినే భగవత్సన్నిధిని విన్నవిస్తున్నారు. అయితే ఈ దాస్యము జీతానికి పనిచేసే మనపనివారిదాస్యంలా ఉండకూడదు. ఒకరినుండి ఏదైనా పొందాలని వారి కింద దాస్యం చేయడం ఒక పద్ధతి. ఏవేవో కోరికలతో స్వామిని ఆశ్రయించేవారు ఈ రకంవారు. ఇవేవీ కాదు. నాకు కావలసినది కైంకర్యం చేయడం. నాకు ప్రీతి పూర్వకమవ్వాలి. ఆ దాస్యం ఇతర విషయాలలో ఉండకుండా భగవద్విషయంలోనే ఉండాలి. ఈ దాస్యం చేసేను కనుక ఈ లోక సుఖములు లభించాలి అనే కోరికతో కాకుండా, కేవలం అందులోనే ఆనందానుభూతిని పొందేలా ఉండాలి. అటువంటి దాస్యాన్ని నాకు అనుగ్రహించు స్వామీ! అని అర్థిస్తున్నారు.

మూ।। తవానుభూతి సంభూత ప్రీతికారిత దాసతామ్ ।
దేహి మే కృప యానాథ! న జానే గతిమన్యథా ॥

సర్వావస్థోచితాశేష శేషతైక రతిస్తవ ।
భవేయం పుండరీకాక్ష! త్వమేవైవం కురుష్వమామ్ ॥

ఇంతవరకు తాముగా మాట్లాడిన రామానుజులు ఇప్పుడు ఇతిహాసాలలో పెద్దలు ప్రార్థించిన శరణాగతి స్ఫోరకమైన మాటలను ఉటంకిస్తున్నారు. ఇందులో మొదటి శ్లోకంలో భగవంతునితో నీ అనుభవం వలన కలిగిన ప్రీతివలన చేసే దాస్యాన్ని నాకనుగ్రహించు అంటున్నారు. ఎవరికి? "మే!" నాకు నీ దాస్యమునందు రుచి తప్ప వేరే అర్హతలు లేని నాకు అనుగ్రహించు! "న జానే గతిరన్యథా" కరుణాసింధువులైన నీవు తప్ప వేరొకగతిలేదు నాకు. "నాథ" నీవు తప్ప వేరొక ఉపాయంలేనివాడిని. నీవా ప్రభువువు. నేను దాసుడను. నీవు తప్ప వేరెవరు నాకు రక్షకులు? అంటున్నట్లుగా సాగుతుందీ శ్లోకం.

ఇక రెండవ శ్లోకంలో భగవద్దాస్యంలో రుచి, ప్రీతి కూడా నీవే కలిగించవయ్యా! అని ప్రార్థిస్తున్నారు. ఇందులో పుండరీకాక్ష శబ్దం సాభిప్రాయం. ఆ





కనుల అందంతో తనవైపు ఆకర్షించుకొని, చల్లని చూపుతో అనుగ్రహించమని ప్రార్థిస్తున్నారు. **"జాయమానం హి పురుషమ్"** ఎవరు జన్మించినపుడు స్వామి కడగంటి చూపులు వాని మీద పడతాయో, వాడే భగవద్భక్తుడవుతాడని భారతం చెప్పింది. "జితన్తా" స్తోత్రంలో **"జితన్తే పుండరీకాక్ష"** అంటారు. ఆ తామరలవంటి నేత్రాల సొగసుకు ముగ్ధులయి వశపడిపోతారు భగవద్భక్తులు.

మూ।। ఏవంభూత తత్త్వయాథాత్మ్యావబోధ
త దిచ్ఛారహితస్యాపి ఏ త దుచ్చారణ
మాత్రావలంబనేన ఉచ్యమానార్థ పరమార్థ
నిష్ఠంమే మనస్త్వమేవ అద్యైవకారయ ॥

ఈ ప్రార్థన విని "భగవానుడు ఈ విధంగా ప్రశ్నించే అవకాశమున్నదని భావిస్తున్నారు భగవద్రామానుజులు. "సరేనయ్యా! రామానుజా! నీకోరిక తెలిసింది. కాని, నీకు దానిని అందించాలంటే, పొందవలసిన భగవదనుభవం గురించి పరిపూర్ణంగా తెలుసుకొని ఉండాలి. దానిమీద ప్రీతి ఉండాలి. అవేమీ లేకుండా ఎలా ఇచ్చేయను? అంటాడని భావించి చెబుతున్నారు.

పెద్దలు చెప్పిన సూక్తులను నేను విని వాటిని తిరిగి నోటితో ఉచ్చరించినంత మాత్రాన దీనిలో ఉన్నభావంలో నా మనసు లగ్నమయ్యేలా చేయవా తండ్రీ! నాకు తత్త్వస్వరూపం ఏమీ తెలియదు. జీవుని స్వరూపమేమిటో తెలిస్తే తత్త్వం తెలిసినట్లు. కాని, నాకవేమీ తెలియదు. పోనీ తెలుసుకోవాలనే కోరిక కూడా లేదు. కాని కేవలం నీ అనుగ్రహం వలన నాకు తత్త్వ యాథాత్మ్య జ్ఞానం కలిగేలా చేయమని ప్రార్థిస్తూ, ఎప్పుడూ చేస్తానంటే కుదరదు. ఇప్పుడే అనుగ్రహించమని రంగనాథుని సన్నిధిన విన్నపం చేస్తున్నారు భగవద్ రామానుజులు.

**7 మూలము:**

**అపార కరుణాంబుధే! అనాలోచిత విశేషాశేషలోకశరణ్య!**
**ప్రణతార్తిహర! ఆశ్రితవాత్సల్యైక మహోదధే! అనవరతవిదిత**
**నిఖిల భూతజాతయాథాత్మ్య! సత్యకామ! సత్యసంకల్ప!**
**ఆపత్సఖ! కాకుత్స్థ! శ్రీమన్! నారాయణ! పురుషోత్తమ!**
**శ్రీరంగనాథ! మమనాథ! నమోఽ_స్తుతే ॥**

రంగనాథుని కరుణాసముద్రుడా అని సంబోధిస్తున్నారిక్కడ.

**"కరుణః పరదుఃఖా సహిష్ణుత్వమ్"** ఇతరుల దుఃఖాన్ని చూచి ఓర్వలేక పోవడం. ఆ కరుణ ఇంత అని చెప్పలేము. కనుక, "కరుణాంబుధే" సముద్రంతో పోల్చేరు. ఆ సముద్రం 'అపార' అంతులేనిది అన్నారు. ఆశ్రితుల విషయంలోనేకాక మనుష్య మాత్రులయితే చాలు. వారి కష్టానికి వారికంటే ఎక్కువ దుఃఖపడేవాడు పరమాత్మ. ఈ విషయం రామాయణంలో "భృశం భవతి దుఃఖితః" అన్నప్పుడు తెలుస్తోందని వెనుకనే చెప్పుకున్నాం కదా! ఆకరుణాసముద్ర ప్రవాహం హద్దులు దాటి ప్రవహిస్తోంది. కనుక, అది అపారం.

ఆ కృప ఉండడం వలన ఆ స్వామి... సర్వలోక శరణ్యుడయ్యాడు. ఉత్తమ వంశంలో జన్మించాడా, అధమకుల సంజాతుడా, జ్ఞాన పరిపూర్ణుడా, జ్ఞానహీనుడా అనే తేడాలేకుండా ఎవరు తన పదసన్నిధిన చేరి, శరణు అంటే, వారికి శరణ్యుడయి ఉండేవాడు పరాత్పరుడు. శరణు పొందే వారి దుఃఖాలను తొలగించేవాడు ఆ స్వామి. "వాత్సల్యజలధే" అంటున్నారు. అప్పుడే పుట్టిన దూడమీద ఆవుకుండే ప్రేమను వాత్సల్యము అంటారు. రుచికరమైన ఆహారం తనముందున్నా దానికన్నా ముందు దూడ మురికిని నాకి శుభ్రం చేస్తుంది ఆవు. అలానే ఆశ్రితుల దోషాలను తొలగించడంలో ముందుండేవాడు పరమాత్మ. దీనిని 'దోషభోగ్యత" దోషాన్ని ఇష్టంగా స్వీకరించడం అంటారు. వెనుక చెప్పిన కరుణ కంటే గొప్పగుణమిది.





ప్రాణి సమూహాలన్నిటియొక్క యథార్థతత్త్వాన్ని ఉన్నది ఉన్నట్లుగా ఎరిగినవాడు. ఏ కాలంలోనైనా ఇదే లక్షణం గలవాడు పరాత్పరుడు. ఆ స్వామి సత్యకాముడు. అంటే ఆ సర్వేశ్వరునకు తీరని కోరిక అంటూ ఏమీలేదు. కోరిక కలిగిందా తీరిపోయిందే! అందువలన భక్తులు ఏవేవో కానుకలిస్తేనే వారి కోరిక తీరుస్తాడేమో అనే అనుమానం అక్కరలేదు. ఆ స్వామి సత్యసంకల్పుడు.

తాను సంకల్పించిన పనిని తప్పక పూర్తి చేయగలధీమంతుడా స్వామి.

ఆ స్వామి ఆపత్సఖుడు. ఆపదలను పోగొట్టే స్నేహితుడు. మనకి మనం కొన్ని ఆపదలను కొని తెచ్చుకుంటాం. ఇతరులవల్ల కొన్ని ఆపదలు వస్తాయి. వాటన్నిటిని పోగొట్టేవాడు భగవానుడు. అందువలన ఎప్పుడైనా ఆ స్వామే శిక్షింపదలచినా, మళ్ళీ తానే ఒడిలో చేర్చుకొని కాపాడుతాడు. క్షమామూర్తి అయిన లక్ష్మీదేవి కూడా మన తప్పుల కెప్పుడైనా విసుక్కుంటే...

**"ఎన్నడియార్ అదుశెయ్యార్"** నా భక్తులు అలా చెయ్యరు.. అని వెనకేసుకుని వస్తాదుస్వామి. తాను కలిగించిన ఆపదను కూడా తానే తొలగించి కాపాడుతాడు అనడానికి నిదర్శనమైన పేరుతో **కాకుత్స్థా** అని సంబోధిస్తున్నారు రామానుజులు. కకుత్స్థ వంశంలో పుట్టిన రామచంద్రుడు తప్పుచేసిన కాకాసురునిపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి మళ్ళీ ఆ కాకి వచ్చి కాళ్ళమీద వాలినపుడు **వధార్హమపి కాకుత్స్థః"** కృపయా పర్యపాలయ్ చంపదగినవాడే అయిన దయతో కాపాడాడు రామచంద్రుడు. ఆ స్వామి ఎప్పుడూ లక్ష్మీ విశిష్టుడై ఉంటాడు. అందువలన దోషభూయిష్ఠులమైన మనం దరిచేరినపుడు అమ్మ ఆయనకు నచ్చచెప్పి స్వామి అనుగ్రహాన్ని మనకు అందింప చేస్తుంది. ఆ స్వామి నారాయణుడు. మనందరితో సహజ సంబంధం కలవాడు. కనుక ఒకప్పుడు అమ్మాగ్రహించినా ఆ స్వామి దరిచేర్చుకుంటాడు.

ఇటువంటి దంపతులకు బిడ్డలమైన మనకేమి కొరత అనే ధైర్యంతో భగవద్రామానుజులు రంగనాథుని సన్నిధిని శరణాగతి చేస్తున్నారు. ఆ స్వామి పురుషోత్తముడు. **పురు–సునోతేతి పురుషః** అధికముగా ఇచ్చువాడు పురుషుడు. జీవుడు కూడా పురుషుడే అయినా పరమాత్మ అంతకన్న అధికుడు కనుక పురుషోత్తముడు. ఆయన ఔదార్యానికి ఋజువు భగవద్గీతలో కనిపిస్తుంది. **"ఉదారాః సర్వ ఏవైతే"** నా దగ్గర పుచ్చుకున్న వాళ్ళందరూ ఉదారులే! అంటాడు. అందువలన పుచ్చుకున్న వాళ్ళనే ఉదారులనే స్వభావం మా స్వామిది.

ఇన్ని గుణాలు కలిగి కంటికి అందనంత దూరంలో పరమపదంలో ఉండే శాస్త్రాలవల్ల మాత్రమే తెలుసుకోవాలి. కాని, కంటికి కనిపించేలా దేవాలయంలో వచ్చి పవళించి, అనుగ్రహిస్తున్న రంగనాథా! అని తృప్తిగా సంబోధిస్తున్నారు రామానుజులు.

చివరగా రంగనాథా! నమోస్తుతే అంటున్నారు. కంటికి కనపడేలా వచ్చి నీకూ మాకూ ఉన్న సంబంధాన్ని తెలియ చేస్తున్నావా తండ్రీ! అని తృప్తితో రంగనాథా! నా ప్రభూ అని సంబోధించారు. ఎప్పుడైతే సంబంధజ్ఞానం కలిగిందో అప్పుడు పలకవలసిన మాట "నమః" తండ్రీ నాకు నేను చెందిన వాడను కాను. నేను నీకే స్వంతమని తమ సర్వభారాలను భగవంతునిపై ఉంచి మనందరి తరపున శరణాగతి చేసారు భగవద్రామానుజులు.

ఆ ఫలితాన్ని మనమందరం అందుకుందాం!

భగవదనుగ్రహానికి పాత్రులమవుదాం!!